




# మనం

## మెదక్ సంగారెడ్డి సిద్దిపేట

గురువారం | 12 | అక్టోబర్ | 2023 | పేజీలు : 7


# కారు టాప్ గేర్



- 15 నుంచి వరుస బహిరంగ సభలు
- భారీ జన సమీకరణే లక్ష్యంగా అడుగులు
- 15న హుస్నాబాద్ నుంచి మొదలు
- కేసీఆర్ స్పీచ్ కోసం సర్వత్రా ఉత్కంఠ

సిద్దిపేట, అక్టోబర్ 11, మనం న్యూస్ ప్రతినిధిః సార్వత్రిక ఎన్నికల సమరానికి నగారా మోగిందో లేదో అప్పుడే బిఆర్ఎస్ పార్టీ ప్రచారానికి కారును సిద్ధం చేసింది. ఎవరైనా నగారా మోగిన తొలి రోజుల్లో మెల్లగా మొదలుపెట్టి నామినేషన్ల పర్వం పూర్తయ్యాక స్పీడ్ పెంచడం పరిపాటి. కానీ బిఆర్ఎస్ పార్టీ రెండుమార్లు ఇప్పటికే అధికారంలో ఉండి, మరోమారు హ్యాట్రిక్ సాధించేందుకు స్టార్టింగ్ స్టార్టింగే టాప్ గేర్ వేసింది. ఎవరి ఊహలకు అందని విధంగా ఏకకాలంలో అన్ని నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించడంతోపాటు ఆయా జిల్లాల్లో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు ఎలక్షన్ ట్రబుల్ షూటర్ మంత్రి హరీష్‌రావు, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటీఆర్‌లు కాలుకు బలపం కట్టుకొని ఓ విడత ప్రచారాన్ని ముగించారు కూడా. ప్రతిపక్ష పార్టీలు కనీసం అభ్యర్థులను ప్రకటించేందుకు కూడా మల్లగుల్లాలు పడుతున్న సమయంలో బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎవరి ఊహలకు అందని విధంగా ప్రచారంలో ఏకంగా టాప్‌గేర్‌నే వేశారు. ఇప్పటికే జనరంజక పాలన, అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నామని చెప్పుకుంటున్న బిఆర్ఎస్ ఈనెల 15న మరికొన్ని ఆకర్షణీయమైన పథకాలను మేనిఫెస్టోలో చేర్చి 15వ తేదీన మేనిఫెస్టో విడుదల చేయనున్నారు. విడుదల చేసిన వెనువెంటనే సెంటిమెంట్ నియోజకవర్గంగా పేరొందిన అచ్చొచ్చిన హుస్నాబాద్ నుండి ఎన్నికల ప్రచారానికి మిగతా 2లో..

## సభాస్థలిని పరిశీలించిన సిపి శ్వేత



2 లో

## ముదిరాజ్‌లను పట్టించుకోని గత ప్రభుత్వాలు

- బిఆర్ఎస్‌తోనే దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి
- సిద్దిపేట, గజ్వేల్ తరహాలో దుబ్బాక అభివృద్ధి చేస్తా
- ఎంపి, దుబ్బాక బిఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి

2 లో



# బిఆర్ఎస్‌కు షాక్...

**-బీజేపిలో చేరిన చందాపూర్ సర్పంచ్**

**-పార్టీలో అవమానాలు భరించలేకే పార్టీ మారానంటున్న బొడ్డు నర్సింలు**



తొగుట, అక్టోబర్ 11, మనం న్యూస్ః రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో దుబ్బాక నియోజకవర్గంలో గెలిచి సత్తా చాటాలనుకుంటున్న బిఆర్ఎస్ పార్టీకి తొగుట మండలంలో ఊహించని షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన చందాపూర్ గ్రామ సర్పంచ్ బొడ్డు నర్సింలు బుధవారం ఎమ్మెల్యే రఘునందన్‌రావు సమక్షంలో బీజేపి పార్టీలో చేరారు. పార్టీ మారిన అంశంపై సర్పంచ్ బొడ్డు నర్సింలును 'మనం' న్యూస్ ప్రశ్నించగా ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి అనుసరిస్తున్న వైఖరి మూలంగానే తాను పార్టీని వీడానని, ఉద్యమ కాలం నుండి నేటి వరకు బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేశామని, నాడు ఎంపిగా నేడు ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన తదనంతరం ఏనాడూ తనను పట్టించుకోలేదని, కార్యకర్తలు ఎంతో కష్టపడి పునాదులు వేసిన పార్టీని ఎంపి ప్రభాకర్‌రెడ్డి సరైన పంథాలో నడిపించలేకపోతున్నారని, ఎంపి వైఖరి ఇలాగే కొనసాగితే పరిస్థితి చేయిదాటిపోయి కారు స్టీరింగ్ అదుపు తప్పిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపి పార్టీ గెలుపుకు కృషి చేస్తానని తెలిపారు.

# కారు టాప్ గేర్

మొదటి పేజీ తరువాయి..

శంఖారవం ఊదనున్నారు బిఆర్ఎస్ అధినేత కేసీఆర్. బిఆర్ఎస్ పార్టీ అధికారం చేపట్టిన రెండుమార్లు హుస్నాబాద్ నుండే ఎన్నికల శంఖారావాన్ని మోగించి విజయాన్ని సాధించింది. కేసీఆర్‌కు లక్ష్మి నియోజకవర్గంగా సెంటిమెంట్ ఉన్న హుస్నాబాద్ నుండి మరోమారు నగారా మోగించేందుకు, హ్యాట్రిక్ విజయాన్ని దక్కించుకునేందుకు సమరశంఖం పూరించనున్నారు. మేనిఫెస్టో ప్రకటించిన కొద్దిసేపటి తర్వాతే హుస్నాబాద్ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న బహిరంగ సభలో కేసీఆర్ ఏం మాట్లాడుతారోనన్న సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. గత కొన్ని రోజులుగా అస్వస్థతతో బాధపడుతున్న కేసీఆర్ పూర్తిగా కోలుకున్న తర్వాత పాల్గొంటున్న తొలి సభ కావడంతో అందరి దృష్టి హుస్నాబాద్ పైనే కేంద్రీకృతమైంది. 15వ తేదీన హుస్నాబాద్‌లో, వెనువెంటనే మరుసటి రోజున 16న జనగామలో, 17వ తేదీన సిరిసిల్లలో బహిరంగ సభలకు ప్లాన్ చేయడంతో భారీ జన సమీకరణకు స్థానిక అనుచరగణం ఏర్పాట్లలో నిమగ్నమైంది. సిద్దిపేట ప్రగతి శంఖారావం పేరుతో ఈనెల 17వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు 15వ వార్డు పరిధిలోని నాగదేవత గుడి సమీపంలో సువిశాల వ్యవసాయ క్షేత్రాన్ని సభ కోసం నిర్ణయించారు. బుధవారం ఉదయం మంత్రి హరీష్‌రావు సభాస్థలి ఏర్పాటు, జన సమీకరణపై పూర్తి ఫోకస్ చేశారు. లక్షకు తగ్గకుండా జనసమీకరణ చేయడమే లక్ష్యంగా క్యాడర్‌కు దిశానిర్దేశం చేశారు.

**-కలిసి వెళ్దాం... దేడ్ లాఖ్ మెజార్టీ ఇద్దాం**

కుటుంబం అన్నాక చిన్న చిన్న అభిప్రాయ భేదాలు సహజం. కానీ కుటుంబం పెద్ద కోసం భేదాభిప్రాయాలు పక్కన పెట్టి అందరం కలిసి పనిచేద్దామని, రాబోయే ఎన్నికల్లో రికార్డు మెజార్టీని సాధిద్దామంటూ బల్దియా మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజనర్సు క్యాడర్‌కు దిశా నిర్దేశం చేశారు. బల్దియా పరిధిలోని వార్డు కౌన్సిలర్లు, ఆయా వార్డుల విభాగాల అధ్యక్షులు, ముఖ్య నాయకులతో



కలిసి ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో పట్టణ అధ్యక్షులు కొండం సంపత్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాజీ ఛైర్మన్ రాజనర్సు, సీనియర్ నాయకులు చిన్న, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, పాలసాయిరామ్‌లు క్యాడర్‌లో జోష్‌ను నింపే ప్రయత్నం చేశారు. అందరం కలిసి పని చేస్తేనే గత ఎన్నికల్లో రికార్డు మెజార్టీ వచ్చింది. దాన్ని బద్ధలు కొట్టాలంటే మరింత కష్టపడాల్సిన అవసరం ఉంది. ఒక్కో వార్డులో కొంతమందికి అవకాశాలు వచ్చాయి, కొంతమందికి రాలేకపోయాయి... రాబోయే ప్రభుత్వం మనదే. అందరినీ కాపాడుకుంటాం.. అధైర్యపడొద్దు.. ఒక్కటిగా ఉందాం... దేడ్ లాఖ్ మెజార్టీ సాధిద్దామన్నారు. 50 రోజులు ప్రతి కార్యకర్త తానే హరీష్‌రావుగా భావించి రికార్డు మెజార్టీ కోసం పని చేయాల్సిన అవసరం ఉందని సూచించారు.

# పోలీస్ కమీషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు

**సిద్దిపేట పోలీస్ కమీషనర్ శ్వేత**



సిద్దిపేట రూరల్, అక్టోబర్ 11, మనం న్యూస్ః సిద్దిపేట పోలీస్ కమీషనరేట్ పరిధిలో నేటి నుండి ఈనెల 19వ తేదీ ఉద యం 6 గంటలకు సిటీ పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని సిద్దిపేట పోలీస్ కమీషనర్ శ్వేత ఒక ప్రకటనలో తెలిపారు. యాక్ట్ అమలులో ఉన్న సమ యంలో ఎవరు కూడా ధర్నా లు, ర్యాలీలు, రాస్తారోకో లు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదన్నారు. అలాంటి కార్యక్రమాల నిర్వహణకు ముందస్తుగా పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, లేనిపక్షంలో చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# ముదిరాజ్‌లను పట్టించుకోని గత ప్రభుత్వాలు

దుబ్బాక టౌన్, అక్టోబర్ 11, మనం న్యూస్ః దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి బిఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని, ఎన్నికలప్పుడు వచ్చి మాయమాటలు చెప్పే పార్టీలను నమ్మవద్దని ఎంపి, దుబ్బాక బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం రోజున దుబ్బాక పట్టణంలోని పెద్దమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ముదిరాజ్‌లు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో రాష్ట్రాన్ని పాలించిన ఏ పార్టీలు కూడా ముదిరాజ్‌లను పట్టించుకున్న పాపాన పోలేదని, తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత సీఎం కేసీఆర్ ముదిరాజ్‌ల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారన్నారు. ముదిరాజ్‌లు ఆర్థికంగా ఎదిగేందుకు చేపలు పట్టేందుకు ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే రాష్ట్రంలోని ప్రతి చెరువుకు జలకళ సంతరించిందని, ఈ ప్రాంత ప్రజలకు సాగునీటి కష్టాలు తీర్చేందుకు మల్లన్న సాగర్ వంటి ప్రాజెక్టు నిర్మించడం జరిగిందన్నారు. నేడు కూడవెల్లి జలకళతో కళకళలాడుతుందంటే అది కేసీఆర్ వల్లే అన్నారు. రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా చేసి తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని, మరోమారు రాష్ట్రంలో కేసీఆర్ సారథ్యంలో బిఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించడం తథ్యమన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులతో దుబ్బాక అభ్యర్థిగా బరిలో నిలిచానని గజ్వేల్, సిద్దిపేట తరహాలో దుబ్బాకను అభివృద్ధి బాటలో నడిపిస్తానన్నారు. ఎన్నికల ముందు కొంతమంది కొత్తతరహా తాయిలాలకు తెర లేపారని, ఎవరెన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు నమ్మి మోసపోవద్దన్నారు. దుబ్బాక ప్రజలు బిఆర్ఎస్ పార్టీకి ఓటేసి దుబ్బాక అభివృద్ధికి కృషి చేయాలన్నారు. గతంలో ముదిరాజ్‌లు బిఆర్ఎస్ పార్టీ వైపే ఉన్నారని, ఈసారి కూడా బిఆర్ఎస్ పార్టీకి మద్ధతు తెలిపి



దుబ్బాకలో బిఆర్ఎస్ జెండా ఎగురవేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిముదిరాజ్ సంఘం అధ్యక్షులు మాడబోయిన రాజు, కౌన్సిలర్ దేవుని లలిత చంద్రయ్య, పర్స రవిందర్, దేవుని రాజు, పర్స కృష్ణ, మల్లయ్య, నాగరాజు, మల్లేశం, దేవుని రమణ, పర్స కార్తీక్, తెరాస నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సభాస్థలిని పరిశీలించిన సిపి శ్వేత

హుస్నాబాద్,అక్టోబర్ 11,(మనం న్యూస్)ః ఈ నెల 15 న హుస్నాబాద్‌లో కేసీఆర్ ఎన్నికల ప్రచార సభను నిర్వహించనున్నారు. ఈ సభాస్థలిని సిద్దిపేట సి.పి.శ్వేత బుధవారం స్థానిక ఏసిపి వాసాల సతీశ్, సి.ఐ.కిరణ్‌లతో కలిసి పరిశీలించారు. సభాస్థలిలో ఎటువంటి ఆటంకాలు చోటు చేసుకోకుండా పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ బందోబస్తును నిర్వహించడం జరుగుతుందన్నారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం జరగకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని ఆమె పేర్కొన్నారు. కేసీఆర్ సభకు జనం ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉండటంతో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆమె స్పష్టం చేసారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఎస్.ఐ.తోట మహేశ్, అక్కనపేట ఎస్.ఐ.తాండ్ర వివేక్,కోహెడ ఎస్.ఐ.తిరుపతి, తదితరులున్నారు.

# అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు పక్కా

**- ఇంటింటికి కాంగ్రెస్ ప్రచారం**

**- కాంగ్రెస్ నాయకుడు మాలోతు శ్రీనివాస్ నాయక్**

హుస్నాబాద్,అక్టోబర్ 11,(మనం న్యూస్)ః కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తుందని చాపగాని తండా గ్రామ శాఖ అధ్యక్షుడు మాలోతు శ్రీనివాస్ నాయక్ అన్నారు. అక్కనపేట మండలంలోని చాపగాని తండా, పేర్లబండ తండా, పన్యా నాయక్ తండాలలో ఆరు గ్యారంటీల పథకాల కార్డుతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఇంటి ఇంటికి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం లభిస్తుందన్నారు. రూ.500 లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల లోపు ఉచిత



విద్యుత్‌ను కాంగ్రెస్ అందజేస్తుందన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇవ్వడం జరుగుతుందన్నారు. తెలంగాణలో గెలిచేది, హుస్నాబాద్‌లో గెలిచేది కాంగ్రెస్ పార్టీనేనని ఆయన ధీమా వ్యక్తం చేసారు.

# బిఆర్ఎస్ నుండి బిజేపిలోకి వలసలు



-గ్రామాలకు కేంద్ర నిధులు తప్ప రాష్ట్ర నిధులు లేవు

-బిసిల సంక్షేమం కోసం కృషి చేసేది భాజపానే

-వివిధ మండలాల నుండి బిజేపిలో చేరిన ప్రజాప్రతినిధులు

-పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే రఘునందన్‌రావు



దుబ్బాక, అక్టోబర్ 11, మనం న్యూస్ః గ్రామాలు అభివృద్ధి చెందితే దేశం బాగుపడుతుందని భావించి ఎంతో మంది యువత తమ గ్రామాలను అభివృద్ధి బాటన పరిచేందుకు ప్రజాప్రతినిధులుగా గెలిచారని, పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో నిధులు రాక అభివృద్ధి జరగక విసుగుచెంది బీజేపి పార్టీతోనే అభివృద్ధి జరుగుతుందని నమ్మి నేడు బీజేపి పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. బుధవారం రోజున దుబ్బాక నియోజకవర్గంలోని మిరుదొడ్డి, తొగుట, రాయపోల్ మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు బిఆర్ఎస్ పార్టీ నాయకులు రఘునందన్‌రావు సమక్షంలో బిజెపి పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో ఏ గ్రామాన కూడా తెలంగాణ ప్రభుత్వం నిధులు విడుదల చేయక ఎంతో మంది సర్పంచ్‌లు తమ ఆస్తులను అమ్మి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. కేవలం కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న ఎన్ఆర్ఈజిఎస్ నిధులు తప్ప రాష్ట్ర ప్రభుత్వం రూపాయి కూడా విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తే రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తుందని నమ్మి ఎంతో మంది ఉద్యమంలో పాల్గొన్నారని, కానీ రాష్ట్రం సద్ధించాక బిఆర్ఎస్ పార్టీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి ముదిరాజ్ సమావేశంలో ముదిరాజ్‌ల సంక్షేమం కోసం బిఆర్ఎస్ పార్టీ పని చేస్తుందని మాట్లాడడం విడ్డూరంగా ఉందని, బిఆర్ఎస్ ఎన్నికల అభ్యర్థుల్లో ఏ ఒక్కరికి కూడా ముదిరాజ్‌లకు టికెట్ ఇవ్వలేదని, దీన్నిబట్టే ముదిరాజ్‌ల పట్ల వారికున్న ప్రేమ తెలుస్తుందన్నారు. 55 శాతం ఉన్న బిసిలకు ఈ ప్రభుత్వం చేసిందేమీ లేదని, మాయమాటలు తప్ప బిసిలకు ఏనాడు కూడా న్యాయం చేయలేదన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం 70 శాతం తన మంత్రివర్గంలో బిసి, ఎస్సీ ఎస్టీ మహిళలకే అధిక ప్రాధాన్యత ఇచ్చి మంత్రివర్గంలో చోటు కల్పించారని, దీన్నిబట్టే బీజేపికి ఉన్న చిత్తశుద్ధి తెలుస్తుందన్నారు. నేడు ఎంతో మంది బిసి ప్రజాప్రతినిధులు, నాయకులు బీజేపి వైపు చూస్తున్నారని, మరికొన్ని రోజుల్లో రాష్ట్రంలో ఇటు నియోజకవర్గంలో బిసిలందరూ బిఆర్ఎస్ పార్టీకి దూరం కావడం తథ్యమన్నారు. పార్టీలోకి వచ్చిన ప్రతి ఒక్కరికి సమాన ప్రాధాన్యత ఉంటుందని, ప్రతి ఒక్కరు కలిసికట్టుగా పని చేసి దుబ్బాక నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగురవేసేందుకు కంకణబద్ధులు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఎస్‌జిఎఫ్ అండర్ 19 ఖోఖోలో రాష్ట్ర స్థాయికి తొగుట విద్యార్థినిలు

కళాశాల ప్రిన్సిపల్ శంకర్ నాయక్



తొగుట, అక్టోబర్ 11, మనం న్యూస్ః తొగుట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినిలు సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఖోఖో క్రీడల్లో గెలుపొంది రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ శంకర్ నాయక్ తెలిపారు. ఎంపిసి సెకండ్ ఇయర్ చదువుతున్న రంగబోయిన మానస, ఎంపిసి మొదటి సంవత్సరం చదువుతున్న సీత, మమతలు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక కావడం జరిగిందని, జిల్లా స్థాయి పోటీల్లో వీరు ఉత్తమ ప్రతిభ కనబరచగా 24 జట్లతో పోటీపడి గెలిచిన విద్యార్థులతో మళ్లీ పోటీ నిర్వహించి రాష్ట్ర స్థాయికి ఎంపికకావడం జరిగిందన్నారు. వీరు ఉమ్మడి జిల్లా తరుపున 67వ నేషనల్ స్కూల్ గేమ్స్‌కు ఎంపిక కావడం జరిగిందన్నారు. తొగుట కళాశాల విద్యార్థులు చదువు, ఆటల్లో ముందుంటారని, కళాశాలకు మంచిపేరు తీసుకువచ్చిన విద్యార్థులను ప్రిన్సిపల్ శంకర్ నాయక్ అధ్యాపక బృందం మెమెంటోలతో సన్మానించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా ఇంటర్ విద్యాధికారి సూర్య ప్రకాష్, జిల్లా స్పోర్ట్స్ అదికారి సమ్మయ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో ఉపాధ్యాయుడి ఆత్మహత్య



దుబ్బాక, అక్టోబర్ 11, మనం న్యూస్ః ఆరోగ్యం బాగాలేకపోవడంతో చాలా కాలంగా పాఠశాలకు వెళ్లక ఆర్థిక ఇబ్బందులు తోడవడంతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఉపాధ్యాయుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన దుబ్బాక పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన ఎమ్మాజిగారి మల్లయ్య కుమారుడు ఎమ్మాజి రమేష్ (48) ప్రభుత్వ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో గత రెండు సంవత్సరాల క్రితం తనకు పక్షవాతం రావడంతో మందులు వాడుతూ, ఇంటి దగ్గరే ఉంటూ మానసికంగా కుంగిపోయాడు. కాగా పక్షవాతం వచ్చిన నాటి నుండి పాఠశాలకు సరిగా వెళ్లనందున ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ ఉండడం కన్నా చనిపోవడం మంచిదని అనుకునే వాడు. కాగా బుధవారం ఉదయం 6:30 గంటల ప్రాంతంలో రమేష్ ఇంట్లో వాంతులు చేసుకుంటుండగా తండ్రి ఆరా తీయగా మందు తాగినట్లు తెలపాడు. వెంటనే అతన్ని దుబ్బాక ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా ప్రథమ చికిత్స చేసి సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు. సిద్దిపేటలో వైద్యులు మరింత మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి రిఫర్ చేయగా తాము ఎల్లారెడ్డిపేటలోని అశ్విన్ ఆసుపత్రిలో చేర్చగా మధ్యాహ్నం 1:20 గంటలకు మృతి చెందినట్లు నిర్ధారించారన్నారు. తన కుమారుడికి ఇంత వరకు పెళ్లి కాలేదని, పక్షవాతం వచ్చి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తనను ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేయడంతో జీవితంపై విరక్తి చెంది తనకు తాను మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందినట్లు తెలిపారు. తమ కుమారుడి మృతిపై తమకు ఎలాంటి అనుమానం లేదన్నారు.



## ఆత్మ కమిటీ డైరెక్టర్‌ను పరామర్శించిన మామిడి మోహన్‌రెడ్డి

దౌల్తాబాద్, అక్టోబర్ 11, మనం న్యూస్ః దౌల్తాబాద్ మండల పరిధిలోని గొడుగుపల్లి గ్రామానికి చెందిన ఆత్మ కమిటీ డైరెక్టర్ సుదర్శన్ మాతృమూర్తి మృతి చెందింది. విషయం తెలుసుకున్న దుబ్బాక బిఆర్ఎస్ పార్టీసీనియర్ నాయకులు మామిడి మోహన్‌రెడ్డి బుధవారం వారిని పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట రాయపోల్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌చారి, రాయపోల్ జెడ్పిటిసి యాదగిరి, డైరెక్టర్ ఆంజనేయులు, దౌల్తాబాద్ మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ చింటు, సత్యనారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## బాలల సంరక్షణ అందరి బాధ్యత

సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయాధికారి రఘురాం




సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 11, మనం న్యూస్ః ఆడపిల్లలను కంటికి రెప్పలా కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయాధికారి రఘురాం అన్నారు. ప్రపంచ బాలిక దినోత్సవం సందర్భంగా బుధవారం రోజున సిద్దిపేట జిల్లా న్యాయ సేవాదికార సంస్థ ఆద్వర్యంలో భరోసా, స్నేహిత, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, పలు స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులతో కలిసి సిద్దిపేట జిల్లా కోర్టు ప్రాంగణం నుండి విక్టరీ థియేటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి స్వాతిరెడ్డితో కలిసి ప్రధాన న్యాయాధికారి రఘురాం మాట్లాడుతూ బాలికలను వేధింపులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. బాలికల పరిరక్షణ కోసం అమలులో ఉన్న చట్టాలపై అవగాహన కల్పించేందుకు తరుచూ న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజంలో ఆడపిల్లలను బరువుగా భావించి గర్భస్థ దశలోనే చిదిమేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భ్రూణహత్యల నివారణ కోసం , బాలికల పరిరక్షణ కోసం అనేక పటిష్టమైన చట్టాలు అమలులో ఉన్నాయన్నారు. బాలికలను బరువుగా కాకుండా బాధ్యతగా చూడాలని పిలుపునిచ్చారు. ఆడపిల్లలు ఎక్కడైనా వేధింపులకు గురైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు మలింద్ కాంబ్లీ, శ్రావణి యాదవ్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జనార్ధన్‌రెడ్డి, భరోసా సెంటర్ సిఐ దుర్గా, శిశు సంక్షేమ శాఖ పిడి రాంగోపాల్, సిడబ్ల్యూసి ఛైర్మన్ రాజలింగం, న్యాయవాదులు పత్రి ప్రకాష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో నేడు జరిగే ఆర్టీఐ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 11, మనం న్యూస్ః హైదరాబాద్‌లో ఈనెల 12వ తేదీన జరిగే ఆర్టీఐ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సమాచార హక్కు చట్టం సిద్దిపేట జిల్లా కన్వీనర్ గణపురం చంద్రమౌళి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ జేబిఎస్ కంటోన్మెంట్ పార్క్, మీటింగ్ హాల్‌నందు జరిగే ఆర్టీఐ దినోత్సవాన్ని పుర స్కరించుకొని ఆర్టీఐ వ్యవస్థాపక అధ్యక్షులు జి. ముత్తు ఆదేశాల మేరకు సమాచార హక్కు చట్టం 2005 పై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రెసిడెంట్ బొట్టు ప్రభాకర్, వైస్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్, రాష్ట్ర సెక్రటరీ వెంకట్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ దొడ్డె రాజేంద్రప్రసాద్ హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఆర్‌టిఐ కన్వీనర్, కో కన్వీనర్, సభ్యులందరూ హాజరుకావాలన్నారు.



# పల్లాకు రెవెన్యూ డివిజన్ సెగ

### -ఎమ్మెల్సీని అడ్డుకున్న జేఏసి నేతలు
### -గో బ్యాక్ అంటూ నేతల నినాదాలు

చేర్యాల, అక్టోబర్ 11, మనం న్యూస్ః చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధించే వరకు పోరాటం ఆపేది లేదని జేఏసి నాయకులు అన్నారు. చేర్యాల పాత బస్టాండ్ వద్ద చేపట్టిన చేర్యాల రెవెన్యూ డివిజన దీక్షలు బుధవారం 31వ





రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో కొమురవెల్లి వైశ్య సంఘం సభ్యులు దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతూ స్వచ్ఛందంగా కిరాణ షాపులు, వ్యాపార సంస్థలు చేర్యాల పట్టణం మొత్తం సంపూర్ణ బంద్ పాటించారు. ఈ క్రమంలో జనగామ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థిగా ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని నియమంచడంతో పల్లా రాజేశ్వర్‌రెడ్డి బుధవారం ఉదయం కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకొని బిఆర్ఎస్ కార్యకర్తలతో బైక్ ర్యాలీతో జనగామలో సమావేశం నిర్వహించేందుకు కార్యకర్తలతో తరలి వెళ్లే క్రమంలో చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని గత కొన్ని రోజులుగా



జేఏసి ఆద్వర్యంలో దీక్షలు చేపట్టారు. ఈ దీక్షల వద్దకు పల్లా రాజేశ్వర్ రెడ్డి తన కార్యకర్తలతో వెళ్లగా ఒక్కసారిగా జేఏసి నాయకులు వివిధ పార్టీల నాయకులు కుల సంఘాలు పల్లా గో బ్యాక్ పల్లా గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జేఏసి నాయకులు, పల్లా వర్గీయులు నినాదాలు చేస్తుండడంతో చేర్యాల పోలీసులు ఇరు వర్గాల నాయకులను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి తన కార్యకర్తలతో వెనుదిరిగి వెళ్లారు.

## మంత్రి హరీష్‌రావు దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి

### బీజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్‌రెడ్డి



తొగుట, అక్టోబర్ 11, మనం న్యూస్ః దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావుపై అక్రమ కేసులు పెట్టిస్తున్న మంత్రి హరీష్‌రావు దిగజారుడు రాజకీయాలు మాని హుందాగా వ్యవహరించాలని బీజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ దేశ ప్రధాని మోదీ, మంత్రి హరీష్‌రావుచే సిద్దిపేట మనోహరాబాద్ రైలు మార్గాన్ని వర్చువల్‌గా ప్రారంభించే కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన స్క్రీన్‌ను మంత్రి హరీష్‌రావు ధ్వంసం చేయడం సరికాదని, ఎంపి ప్రభాకర్‌రెడ్డి ప్రధాని మోదీ ఫోటో ఉన్న ఫ్లెక్సీని సైతం చించివేయడం వంటివి చేయడం ప్రధానిని అవమానపరిచే చట్ట విరుద్ధమైన చర్యలకు పాల్పడడం జరిగిందన్నారు. ఇలాంటి చట్ట విరుద్ధ చర్యలను ఖండిస్తూ పోలీస్ స్టేషన్‌లో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు సంఘటనకు బాధ్యులైన వారిపై ఫిర్యాదు ఇవ్వడం జరిగిందని, దీంతో మంత్రి హరీష్‌రావు ఎమ్మెల్యే రఘునందన్‌రావుపై బీజేపి జిల్లా అధ్యక్షులతోపాటు పలువురిపై అక్రమ కేసులు పెట్టించడం జరిగిందన్నారు. గత ఉప ఎన్నికల సమయంలో కూడా ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారని, గౌరవప్రదమైన స్థానాల్లో ఉండి ఇలాంటి దిగజారుడు చర్యలకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. మంత్రి ఎన్ని అక్రమాలకు పాల్పడినా చివరకు ధర్మాన్ని గెలిపించుకునే సత్తా బీజేపి నాయకులకుందని గ్రహిస్తే మంచిదన్నారు. ఇలాంటి చౌకబారు రాజకీయాలను ఇకనైనా మానుకొని ధర్మబద్ధంగా రాజకీయాలు చేయడం అలవాటు చేసుకుంటే రాబోయే తరాలు ఆదర్శవంతమైన నాయకులు, మంచి లక్షణాలు అలవాటు చేసుకుంటారన్నారు.

## డివిజన్ ప్రకటించకపోతే ఎన్నికల్లో బుద్ధి చెప్తాం

కొమురవెల్లి, అక్టోబర్ 11, మనం న్యూస్ః చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటన చేయకపోతే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పార్టీకి తగిన బుద్ధి చెప్తామని కొమురవెల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మాంకాల నగేష్ స్పష్టం చేశారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధనకై చేస్తున్న దీక్షలు బుధవారం 31వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో కొమురవెల్లి మండల ఆర్యవైశ్యులు కూర్చున్నారు. వారికి జేఏసి ఛైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్, కో ఛైర్మన్ పుర్మ ఆగంరెడ్డిలు కండువా వేసి దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం కొమురవెల్లి మండల అధ్యక్షులు మాంకాల నగేష్ మాట్లాడుతూ చేర్యాల రెవెన్యూ డివిజన్ న్యాయమైన కోరిక అని, ఒకప్పుడు తాలూకాగా, నియోజకవర్గ కేంద్రంగా ఉన్న చేర్యాల ప్రాంతం నేడు మున్సిపాలిటీకి పరిమితమై ఈ ప్రాంత ప్రజలకు తీరని అన్యాయం జరగిందన్నారు. ఈ ప్రాంత ప్రజలు ఏసిపి, విద్యుత్తు హుస్నాబాద్, చేర్యాల, కొమురవెల్లి మండలాలకు ఆర్డీఓ, సిద్దిపేట, అగ్రిక్లచర్ డివిజనల్ అధికారి కార్యాలయానికి వెళ్లాలంటే గజ్వేల్, అసెంబ్లీ జనామ, ఎంపి భువనగిరి ఇలా విడదీసి చేర్యాల ప్రాంతాన్ని ముక్కలు చెక్కలుగా చేసి ఈ ప్రాంతానికి ఎంత ద్రోహం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దీక్షలో మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు మాంకాల శంకర్‌లింగం, అంబడిపల్లి బుచ్చిలింగం, కాపర్తి కృష్ణమూర్తి, రావికంటి సత్యనారాయణ, జైన నరేష్, మాంకాల వీరేశం, కాపర్తి మల్లికార్జున్, మాంకాల సరిత, ఉప్పల



నాగరాణి, అంబడిపల్లి లావణ్య, వెల్దె కళ్యాణి తదితరులు పాల్గొనగా వారికి జెడ్పిటిసి గిరి కొండల్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, మాజీ జెడ్పిటిసి కొమ్ము నర్సింగరావు, జిల్లా నాయకులు కొమ్మూరి రాకేష్‌రెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ఒకే ఆలయంలో అష్టాదశ పీఠాలు



### పుష్పగిరి పీఠాధిపతి శంకర భారతి

కొండపాక, అక్టోబర్ 11, మనం న్యూస్ః ఒకే ఆలయంలో అష్టాదశ పీఠాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రజలు అన్ని పీఠాలను ఒకే ఆలయంలో దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతంగా ఉంటుందని పుష్పగిరి పీఠాధిపతి శంకరభారతి అన్నారు. కొండపాక మండల కేంద్రంలోని ఆనంద నిలయంలో అష్టాదశ పీఠ రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట చేసి ఆలయాన్ని పర్యవేక్షించారు. నవంబర్ మాసంలో అష్టాదశ పీఠ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. అష్టాదశ పీఠాలు ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఆధ్యాత్మికంగా ప్రజలకు ఆనంద నిలయం ట్రస్టు చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టు ఛైర్మన్ కె.వి. రమణచారి, గ్రామ సర్పంచ్ చిట్టి మాధుర దేవేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే

### కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్

జిన్నారం, అక్టోబర్ 11, మనం న్యూస్: రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం జిన్నారం మండలం అండూరు గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను వివరించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రజలకు మంచి రోజులు ద గ్గరలోనే ఉన్నాయని వ్యాఖ్యానించారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందన్నారు. గ్రామాల్లో ప్రజా సమస్యలు విలయతాండవం చేస్తున్నాయని, కనీసం పదేళ్లలో నిరుపేదలకు ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వని దయనీయ పరిస్థితి నెలకొందన్నారు. డబుల్ బెడ్‌రూమ్ పేరుతో ప్రజలను వంచించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో ఇందిరమ్మ ఇండ్లే కనిపిస్తున్నాయని తెలిపారు.





రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపిస్తే పేద ప్రజలకు ఆరోగ్య శ్రీ ద్వారా రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం, రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ , రూ. 500లకే గ్యాస్ సిలిండర్, రేషన్ ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ, సొంతింటి నిర్మాణం కోసం రూ. 5 లక్షల ఆర్థిక సాయం నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు, రైతు కూలీలకు, భూమిలేని రైతులకు సైతం రైతుబీమా పథకం, ప్రజా సంక్షేమం కోసం అందించే పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్, పిసిసి సభ్యులు కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎంపిపి రవిందర్, వైస్ ఎంపిపి గంగు రమేష్, మండల ప్రెసిడెంట్ వడ్డె కృష్ణ, నర్సింగరావు, సుధాకర్ గౌడ్, ఎంపిటిసిలు నాగేందర్ గౌడ్, గోవర్ధన్ గౌడ్, ప్రతాప్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రాజు గౌడ్, జనరల్ సెక్రటరీలు సత్యనారాయణ, లక్ష్మణ్, కృష్ణారెడ్డి, సంగారెడ్డి జిల్లా మైనార్టీ ప్రెసిడెంట్ హబీబ్ జానీ సంగారెడ్డి జిల్లా ఐఎన్‌టియుసి ప్రెసిడెంట్ నరసింహారెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యామ్‌రావు, సంగారెడ్డి జిల్లా కన్వీనర్ వాజిద్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసిన దౌలాపూర్ పార్టీ అధ్యక్షులు



పాపన్నపేట, అక్టోబర్ 11, మనం న్యూస్: అధికార బిఆర్‌ఎస్ పార్టీకి దౌలాపూర్ గ్రామ అధ్యక్షులు జలగిరి బాల్‌రాజ్ బుధవారం రాజీనామా ప్రకటించారు. బిఆర్ ఎస్ పార్టీలో గ్రామ అధ్యక్షుడిగా ఉన్న తనకు పార్టీలో కనీస గౌరవం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ మండల అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి చిన్న చూపు చూస్తున్నాడని వెల్లడించారు. పార్టీ కోసం పని చేసే వారందరినీ సమానంగా చూడాలన్నారు. తనకు సముచిత స్థానం ఇచ్చే పార్టీలోనే చేరుతానని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.

## యువత స్వశక్తితోనే ఆర్థికంగా ఎదగాలి

### బీజేపి రాష్ట్ర నాయకులు పులిమామిడి రాజు



సదాశివపేట, అక్టోబర్ 11, మనం న్యూస్: సదాశివపేట పట్టణంలో మహర్ష్ మెన్స్ వేర్ క్లాత్ షోరూమ్‌ను నిర్వాహకులు నరేష్ యాదవ్, వీరేశం యాదవ్‌ల ఆహ్వానం మేరకు రిబ్బన్ కట్ చేసి బీజేపి రాష్ట్ర నాయకులు పిఎంఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ పులిమామిడి రాజు ప్రారంభించారు. తదనంతరం దుకాణ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఉద్యోగాలు రావడం లేదని నిరుత్సాహ పడకుండా యువత స్వశక్తితోనే ఆర్థికంగా ఎదగాలని పేర్కొన్నారు. తమ కాళ్లపై నిలబడే విధంగా సొంతంగా వ్యాపార రంగంలోకి అడుగుపెట్టడం సంతోషమని, అలాగే వినియోగదారులకు మంచి నాణ్యమైన దుస్తులు అందించి మార్కెట్‌లో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకొని దినదినాభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనంతసాగర్ ఎంపిటిసి, రేణుక ప్రభాకర్, మంగలి ఈశ్వర్, పల్లె నగేష్, శ్రీను, ప్రవీణ్, సంతోష్, నర్సింలు, గణేష్, నవీన్, సోమ శంకర్, పిఎంఆర్ యువసేన నాయకులు హరీష్‌కుమార్, అనిల్ రాగమ్, గుణాకర్, నరేష్, వెంకట్, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానం మహాదానం

### మున్సిపల్ ఛైర్మన్ రాజమౌళి



గజ్వేల్, అక్టోబర్ 11, మనం న్యూస్: సమాజంలో అన్నదానాన్ని మించిన దానం మరొకటి లేదని, ఎదుటి వారి ఆకలి తీర్చడంలోనే నిజమైన మానవత్వం దాగి ఉంటుందని గజ్వేల్ మున్సిపల్‌ఛైర్మన్ రాజమౌళి అన్నారు. బుధవారం రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ గజ్వేల్ అధ్యక్షులుఉ ఎస్.బి. ప్రభాకర్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ ఛైర్మన్ రాజమౌళి మాట్లాడుతూ అన్నదానం మహాదానమని, ఈ మాసం పితృపక్ష మాసం రోజుల్లో అన్నదానం నిర్వహిస్తే మంచిదన్నారు. అన్నదానం దివంగత ఎన్‌బి నాగలక్ష్మి రామనాథం దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు ప్రభాకర్, సోదరులు కుటుంబ సభ్యులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాచారం దేవస్థానం డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ గజ్వేల్ అధ్యక్షులు ప్రభాకర్, సిద్ధి బిక్షపతి, లక్ష్మయ్య, కొమురవెల్లి శంకరయ్య, అయిత సత్యనారాయణ, సిద్దేశ్వర్, ఉమేష్, సంతోష్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపి నుండి బిఆర్‌ఎస్‌లోకి చేరిక



సిద్దిపేట రూరల్, అక్టోబర్ 11, మనం న్యూస్: బీజేపికి చెందిన పలువురు నాయకులు బుధవారం మంత్రి హరీష్‌రావు సమక్షంలో బిఆర్‌ఎస్ పార్టీలో చేరారు. సిద్దిపేట అర్బన్ మండలం బీజేపి సోషల్ మీడియా కన్వీనర్ బబ్బూరి నరేష్ గౌడ్, జనగామ సందీప్, సంకటి నాగరాజు, సి.కె. ప్రమోద్, సంకటి అజయ్, అనిల్, శేఖర్, శ్రీనివాస్‌లు మంత్రి హరీష్‌రావు సమక్షంలో బిఆర్‌ఎస్‌లో చేరారు. విఠలాపూర్ గ్రామ బీజేపి పార్టీ ఉప సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి బిఆర్‌ఎస్‌లో చేరారు. తనతోపాటు పదిమంది యువకులు పార్టీలో చేరారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం అందించిన పథకాలను ప్రజలకు వివరిస్తూ అభివృద్ధిలో అడుగు వేస్తామని నూతనంగా చేరిన నాయకులు తెలిపారు. దేశానికే ఆదర్శంగా సిద్దిపేట నియోజకవర్గాన్ని నిలుపుతామని, రికార్డు స్థాయిలో హరీష్‌రావును గెలిపిస్తామని తెలిపారు.






## ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలి

### -మంత్రి క్యాంప్ కార్యాలయాన్ని ఖాళీ చేయాలి

### -సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ

### పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 11, మనం న్యూస్: ఎన్నికల కోడ్ వచ్చి 48 గంటలు గడుస్తున్నా బిఆర్‌ఎస్ పార్టీ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ఫ్లెక్సీలు అధికారులు ఇంకా తొలగించకపోవడంపై కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్ మండిపడ్డారు. ఎన్నికల కోడ్ వచ్చిన సందర్భంగా అధికారులు ఇప్పటికే పలు సూచనలు అందించారే తప్ప ప్రభుత్వానికి సంబంధించిన ఫ్లెక్సీలను ప్రధాన రహదారుల్లో తొలగించి గల్లీలల్లో, ఆటోలపైన అతికించిన వాటిని తొలగించలేదన్నారు. అన్నింటా ప్రత్యేకమైన సిద్దిపేట ఇక్కడ కూడా ప్రత్యేకంగానే ఉందా అని ప్రశ్నించారు. ఉద్యోగులు ఏకపక్షంగా వ్యవహరిస్తే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు. పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావు, పథకాల ఫోటోలు ఇంకా ఉన్నాయన్నారు. మంత్రి క్యాంప్ కార్యాలయాన్ని వెంటనే ఖాళీ చేయాలన్నారు. క్యాంప్ కార్యాలయాన్ని అధికారులు వెంటనే స్వాధీనం చేసుకోవాలని, దీనిపై ఎన్నికల సంఘం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి గ్యాదరి మధు, సిద్దిపేట యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గయజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా సందర్శించిన జిల్లా కలెక్టర్



సిద్దిపేట, అక్టోబర్ 11, మనం న్యూస్ ప్రతినిధిః మానవతా దృక్పథంతో డాక్టర్లు ప్రజలకు సేవలందించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని ఎన్సాన్‌పల్లి గ్రామ శివారులో నూతనంగా నిర్మించి ప్రారంభించిన వేయి పడకగల ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందిస్తున్న సేవలను, మౌళిక వసతులను పరిశీలించారు. ఆసుపత్రిలో ప్రతి డోర్ ముందు మ్యాట్, ఫాలింగ్ సీల్ పనులు పూర్తి చేయాలని ఏజెన్సీకి తెలిపారు. అధికారులందరూ సమన్వయంతో నిర్మాణంలో ఉన్న మిగతా పనులు వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి వచ్చేలా పని చేయాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రికి నిరంతరంగా విద్యుత్ సరఫరా అందేలా చూడాలని విద్యుత్‌శాఖ అధికారులకు తెలిపారు. కలెక్టర్ వెంట మెడికల్ కళాశాల డైరెక్టర్ విమలా థామస్, డిఎంఈ రమేష్‌రెడ్డి, డిఎంహెచ్‌ఓ డా. కాశీనాథ్, టిఎస్ఎంఎస్ఐడిసి డిఈ విశ్వప్రసాద్, డి ఈఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# ఎన్నికల ప్రవర్తనా నియమావళి తప్పక పాటించాలి

### జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమా అగ్రవాల్

దుబ్బాక టౌన్, అక్టోబర్ 11, మనం న్యూస్ః ఎన్నికల నగారా మోగినందున దుబ్బాక నియోజకవర్గ పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా పాటించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్, దుబ్బాక నియోజకవర్గ ఎన్నికల అధికారిని గరిమా అగ్రవాల్ అన్నారు. బుధవారం పట్టణంలోని సమీకృత కార్యాలయ భవనంలో సెక్టోరియల్ అధికారులు, రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సెక్టోరియల్ అధికారులు పోలింగ్ స్టేషన్‌లను పరిశీలించి తగిన సదుపాయాలు, భద్రతా అంశాలు పరశీలించాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రజాప్రతిని ధులు ఎన్నికల కమీషన్ నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటరు జాబితాను పరిశీలించి కొత్తగా ఓటరు నమోదు కోసం ఫారం – 6, అడ్రస్ మార్పు కోసం, పేరు తొలగింపు కోసం ఫారం – 7, ఫారం – 8పై అవగాహన కల్పించి ఓటర్లను చైతన్యం చేయాలని కోరారు. ఈ సమావేశంలో దుబ్బాక నోడల్ అధికారి పి. చంద్రశేఖర్, ఆయా మండలాల తహసీల్దార్‌లు,




అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దళిత జర్నలిస్టులకు దళితబంధు అందించాలి



గజ్వేల్, అక్టోబర్ 11, మనం న్యూస్ః దేవుడు కరుణించినా పూజారి వరమివ్వడం లేదన్న నానుడి గజ్వేల్ నియోజకవర్గంలో అమలవుతుందని దళిత్ వర్కింగ్ జర్నలిస్టు వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు అన్నారు. జిల్లా మంత్రి హరీష్‌రావు దళిత జర్నలిస్టులందరికీ దళితబంధు అమలు చేయాలని సూచించినప్పటికీ గజ్వేల్ నియోజకవర్గంలో మాత్రం అమలు చేయడం లేదన్నారు. ముగ్గురు జర్నలిస్టులకు మాత్రమే దళితబంధు అమలు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. జిల్లాలోని సిద్దిపేట, హుస్నాబాద్, దుబ్బాక నియోజకవర్గంలో అమలు చేసిన పథకం గజ్వేల్ నియోజకవర్గంలో అమలు చేయకపోవడానికి కారణాలు ఏంటని ప్రశ్నించారు. ఎన్నికల్లో పార్టీలు మారి పదవులు చేపట్టవచ్చుకానీ నిజాయితీగా నియోజకవర్గంలోని మండలాల్లో వార్తలు రాస్తున్న విలేకర్లకు మాత్రం ఆంక్షలు విధిస్తారా అని ప్రశ్నించారు. సీఎం సొంత నియోజకవర్గంలోనే దళిత జర్నలిస్టులకు న్యాయం జరగకపోవడం అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. జిల్లా ఇంచార్జ్ మంత్రి స్పందించి గజ్వేల్ నియోజకవర్గంలోని దళిత జర్నలిస్టులందరికీ దళితబంధు మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు పట్టణంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యూజే గజ్వేల్ డివిజన్ ప్రధాన కార్యదర్శి శివదాస్, ప్రచార కార్యదర్శి రామస్వామి, దోమ నర్సింలు, చింతకింది స్వామి, శ్రీనివాస్, ప్రభాకర్, గిరి, కరుణాకర్, కనకయ్య, మల్లేశం, కర్ణాకర్, ప్రవీణ్, ఎల్లం,రాజు, మహేష్, దుర్గయ్య, దయాకర్, బైర ప్రభాకర్‌లు పాల్గొన్నారు.





## కాంగ్రెస్‌కు భారీ షాక్

### బిఆర్ఎస్‌లో చేరనున్న మాజీ ఎమ్మెల్యే



మెదక్, అక్టోబర్ 11, మనం న్యూస్ః మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ ఇచ్చారు. బుధవారం రోజున రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి హైదరాబాద్‌లోని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వారు శశిధర్‌రెడ్డిని బిఆర్ఎస్ పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డికి బిఆర్ఎస్‌లో చేరేందుకు ఓకే చెప్పినట్లు సమాచారం. కాగా అతి త్వరలోనే అధికారికంగా బిఆర్ఎస్ పార్టీలో చేరుతారని ఆయన సన్నిహితులు తెలిపారు.

## ఎన్నికల నియమాలు తప్పకుండా పాటించాలి

### -ఫ్లైయింగ్ స్క్వాడ్ మల్లేశం



మిరుదొడ్డి, అక్టోబర్ 11, మనం న్యూస్ః త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు ఎన్నికల నియమాలను తప్పకుండా పాటించాలని ఫ్లైయింగ్ స్క్వాడ్ మల్లేశం అన్నారు. మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామం వద్ద బుధవారం ఆయన వాహనాలను తనిఖీ చేశారు. రూ. 50 వేలకు పైన ఎవరైనా వాహనాల్లో డబ్బులు తీసుకువెళ్తే రశీదులు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. సరైన పత్రాలు లేకుండా డబ్బులను వాహనాల్లో తరలిస్తే వాహనాలను, డబ్బులను సీజ్ చేయడం జరుగుతుందన్నారు. కావున ప్రతి ఒక్కరు ఎన్నికల నియమ నిబంధనలు పాటించి అధికారులకు సహకరించాలన్నారు. తద్వారా ఎన్నికలు ప్రశాంతంగా సజావుగా జరుగుతాయన్నారు.

## సెయింట్ మేరీస్ పాఠశాలలో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్

### -ముఖ్య అతిథిగాహాజరైన ఏసిపి రమేష్



గజ్వేల్, అక్టోబర్ 11, మనం న్యూస్ః గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పట్టణంలోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్ హై స్కూల్ సిబిఎస్ పాఠశాలలో బుధవారం రోజున స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏసిపి రమేష్, రూరల్ సిఐ జానకిరాంరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులు తయారు చేసిన వివిధ నమూనాలను తిలకించి వారి సృజనాత్మకతను మెచ్చుకున్నారు. విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గోపు ఇన్నారెడ్డి, సిబిఎస్ ప్రిన్సిపల్ విజయ్‌పాల్, ఎస్ఎస్‌సి ప్రిన్సిపల్ రాయప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్‌లో సస్యరక్షణ చర్యలు అవసరం



### -అంతర పంటలు సాగు చేసుకోవచ్చు

### -రాష్ట్ర సలహాదారులు బిఎన్. రావు

జగదేవ్‌పూర్, అక్టోబర్ 11, మనం న్యూస్ః మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల ఆయిల్ పామ్ రైతులలకు దౌలాపూర్ గ్రామంలో రైతు ఉపేందర్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో రైతులకు పంట పర్యవేక్షణపై రాష్ట్ర ముఖ్య సలహాదారు బిఎన్‌రావు ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా బిఎన్‌రావు మాట్లాడుతూ రైతులు ఆయిల్‌పామ్ పంటల సాగు చేసుకున్న తర్వాత ఆయిల్ పామ్ పంట సస్యరక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంటుందన్నారు. మొక్కలకు నీరు ఎక్కువగా ఉండకుండా చూసుకోవాలని, ఎర్ర నేలల్లో చెట్లు ఏపుగా పెరుగుతాయని సూచించారు. పంట మొదటి సంవత్సరం వరకు ఒక మీటర్ దూరంలో ఎరువులు వేసుకోవాలని, రెండో సంవత్సరం రెండు మీటర్ల దూరంలో నీరు అందించి తడిగా ఉండేలా చూసుకొని, మూడో సంవత్సరం మూడు మీటర్ల దూరంలో నీరు తడిగి ఉండేలా చూసుకోవాలన్నారు. ఎరువులు కూడా మూడు మీటర్ల దూరంలోనే వేయాలన్నారు. అలాగే మొక్కలకు నీరు ఎక్కువగా ఉండడం వల్ల మగజాతి గెలలు వస్తాయని, ఆడజాతి గెలలు తక్కువగా వస్తాయన్నారు. మొక్కకు మొదలు ప్రాంతంలో తక్కువ నీరు ఉండేలా చూసి నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. 30 నెలల తర్వాత గెలలు అలాగే ఉంచాలని, మొక్కల మధ్యలో ఖాళీ స్థలంలో అంతర పంటలు వేసుకోవచ్చన్నారు. రైతులకు కూడా దీని ద్వారా ఆర్థిక ఎదుగుదల ఉంటుందన్నారు. జగదేవ్‌పూర్ మండలంలో సుమారు 650 పైగా ఎకరాలు ఆయిల్‌పామ్ నాటు వేశారని, కంపెనీ అందుబాటులో ఉన్నాయ న్నారు. ప్రతి రైతు తమ పక్క రైతులకు కూడా ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించి ప్రోత్సహించాలన్నారు.

పరిశ్రమలు మన దగ్గరే ఉన్నాయని, మార్కెటింగ్ తప్పకుండా ఉంటుందని, ఎంత దిగుబడి వచ్చినా కొనడానికి కంపెనీలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సునీత, ఏడిఏ అనిల్, మండల వ్యవసాయ అధికారి వసంతరావు, ఆయిల్ పామ్ మండల ఇంచార్జ్ శంకర్, ఏఈఓలు ఖలీల్, కిరణ్, భాను ప్రసాద్, సమత, శరణ్య,, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## దౌలాపూర్‌లో ఉచిత వైద్య శిభిరం

జగదేవ్‌పూర్, అక్టోబర్ 11, మనం న్యూస్ః జగదేవ్‌పూర్ మండల పరిధిలోని దౌలాపూర్ గ్రామంలో చిలుకూరి బాల్‌రెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో మెడిసిటీ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిభిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ వంటేరు యాదలక్ష్మి శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసి వైస్ ఛైర్మన్ రాచమల్ల ఉపేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని నిరుపేద ప్రజలు ఉచిత వైద్య శిభిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా అన్ని వ్యాధులకు సంబంధించి బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తామన్నారు. మెరుగైన వైద్యం కోసం మెడిసిటీ ఆసుపత్రిలో సంప్రదించాలని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో డా. దివ్య, డా. నిషిత, డా. ఓం ప్రకాష్, మాజీ ఉప సర్పంచ్ కదుర్ల రాజు, మార్కెటింగ్ బాయ్స్ బాబు గౌడ్, శేఖర్, చేరాలు, నందు, పంచాయతీ సెక్రటరీ సతీష్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక పార్టీ బిఆర్ఎస్

### -కేంద్ర పథకాలకు ఆకర్షితులై బీజేపిలో చేరికలు

### -ఎమ్మెల్యే రఘునందన్‌రావు

మిరుదొడ్డి, అక్టోబర్ 11, మనం న్యూస్ః నిత్యం ప్రజలను, ప్రజాస్వామ్యాన్ని అణిచివేస్తూ రాష్ట్రంలో నిజాం నిరంకుశ పాలనను బిఆర్ఎస్ పార్టీ సాగిస్తుందని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. బుధవారం రోజున మిరుదొడ్డి ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు ఎమ్మెల్యే రఘునందన్‌రావు సమక్షంలో బిజేపి పార్టీలో చేరగా ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ అమలు





చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారానే ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. నేడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర పథకాలను రాష్ట్ర పథకాలుగా పేర్లు మార్చుకొని అమలు చేయడం ప్రజలు గుర్తించడం జరిగిందని, అందుకే బిఆర్ఎస్ చేస్తున్న మోసాలకు, మోసపూరిత వాగ్దానాలకు ప్రజలు ఆగ్రహంతో ఉన్నారన్నారు. వారి అక్కసును వచ్చే ఎన్నికల్లో బీజేపి పార్టీకి ఓటేసి దుబ్బాకలో బిజేపి పార్టీని భారీ మెజార్టీతో గెలిపించనున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో ఉప సర్పంచ్‌తోపాటు వార్డు సభ్యులు కీసరి పార్వతి శంకర్, బిజ్జి చంద్రం, పుల్లూరి సౌందర్య బాలరాజు, సాన కృష్ణ తదితరులు ఉన్నారు.